క్లుప్తంగా

క్వాడ్రాంట్స్ మైన్స్ పరిశీలన



క్వాడ్రాంట్స్ మైన్స్‌ను పరిశీలిస్తున్న ఒరిస్సా అధికారులు

కర్నూలు (న్యూటౌన్): ఒరిస్సా రాష్ట్రానికి చెందిన మైనింగ్ డిపార్ట్‌మెంట్ అధికారులు సంజయ్ కుమార్ దాస్, అంబురాజ, జగన్నాథ్‌మిశ్రా, ఆదిత్య నంద్యాల జిల్లాలోని జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ వద్ద అభివృద్ధి చేసిన టెంపుల్ ఆఫ్ స్టెప్స్‌ను పరిశీలించేందుకు వెళ్తూ కర్నూలు జిల్లాకు వచ్చారని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి.రాజశేఖర్ తెలిపారు. బుధవారం ఒరిస్సా అధికారులు ఓర్వకల్లు క్వాడ్రాంట్స్ గనులు, ఖనిజాలను పరిశీలించారు. అంతకుముందు కర్నూలు మైనింగ్ డీడీ కార్యాలయంలో జిల్లా అధికారులను కలిశారు. అనంతరం నంద్యాల జిల్లాకు బయలుదేరి వెళ్లారు. వారి వెంట జిల్లా మైనింగ్ డీడీ రాజశేఖర్, జిల్లా మైనింగ్ విజిలెన్స్ ఏడీ బైరాగినాయుడు, ఉద్యోగులు ఉన్నారు.

బోసిపోయిన 'బొగ్గుల' నామినేషన్ కార్యక్రమం



జనాలు లేక బోసిపోయిన ర్యాలీ

కర్నూలు సిటీ: కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి బొగ్గుల దస్తగిరి బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసిన ర్యాలీకి ఆశించి స్థాయిలో జనాలు రాలేదు. దీనికితోడు మాజీ కేంద్రమంత్రి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి వర్గం కూడా హాజరుకాలేదు. చేసేదేమీలేక టీడీపీ నాయకుడు డి.విష్ణువర్ధన్ రెడ్డి ఇంటి నుంచి కర్నూలు ఆర్‌డీఓ ఆఫీస్ వరకు ఎక్కడ ఆగకుండా వెళ్లి కర్నూలు ఆర్డీఓ ఆఫీసులో నామినేషన్ వేశారు. కాగా ర్యాలీకి వచ్చిన వారికి ఎస్టీబీసీ కాలేజీ ప్రాంగణంలో బిరియాని, క్వార్టర్ మద్యం సరఫరా చేశారు. ఆహారం అందరికీ అందకపోవడంతో కొద్దిసేపు గందరగోళ పరిస్థితి నెలకొంది. టీడీపీ కూటమిగా ఏర్పడి ఎన్నికల్లో పోటీ చేస్తున్నా ఎక్కడ కూడా ర్యాలీలో బీజేపీ జెండాలు అగుపించకపోవడం గమనార్హం.


కోడ్ ఉల్లంఘన



జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న టీడీపీ నాయకులు

కర్నూలు(సెంట్రల్): పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరుచరితారెడ్డి ఎన్నికల కోడ్ ఉల్లంఘించారు. బుధవారం ఆమె నామినేషన్ వేయడానికి కలెక్టరేట్‌లోని పాణ్యం ఆర్వో కార్యాలయానికి ర్యాలీతో వచ్చారు. ర్యాలీలో టీడీపీ, జనసేన జెండాలతో పాటు కొందరు జాతీయ జెండాను ప్రదర్శించారు. ఇది కోడ్ ఉల్లంఘన కిందకు వచ్చినా ఎన్నికల కమిషన్ అధికారులెవరూ పట్టించుకోలేదు. దీనిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు.

ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



టీకాలు వేసే విధానం గురించి వివరిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): ప్రజలు తమ ప్రాంతాల్లో జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. బుధవారం ఆయన స్థానిక శ్రీరామనగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవజాత శిశువు రోగాల బారిన పడకుండా ఉండాలంటే వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలన్నారు. పుట్టిన బిడ్డ నుంచి 16 ఏళ్ల వయస్సు వరకు పలు విడతలుగా ప్రభుత్వం ఉచితంగా టీకాలు పంపిణీ చేస్తోందన్నారు. బీసీజీ నుంచి టీడీ వరకు అన్ని రకాల టీకాలు అందుబాటులో ఉన్నాయని, ఈ క్రమంలో వంద శాతం లక్ష్యాలను చేరుకోవాలంటే తల్లిదండ్రులు కూడా తమ బిడ్డల ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతూ నిర్దేశించిన కాలమానిని ప్రకారం టీకాలు వేయించాలన్నారు. సకాలంలో అన్ని రకాల టీకాలను చిన్నారులకు ఇప్పించడం వల్ల 12 ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందన్నారు. వ్యాధినిరోధక టీకాల కార్యక్రమం బుధ, శనివారాల్లో నిర్దేశిత శిబిరాల్లో జరుగుతుందన్నారు. వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రత, వేడి గాలుల కారణంగా వడదెబ్బకు గురవుతారని, ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వైద్యాధికారి డాక్టర్ దివ్య, ప్రాజెక్షనిస్టు ఖలీల్, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి చేస్తాం.. అండగా నిలవండి

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్, కుడా చైర్మన్ హర్ష
- అంబేద్కర్ నగర్‌లో ఇంటింటి ప్రచారం





చేనేతల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, అంబేద్కర్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న ఆదిమూలపు సతీష్, కోట్ల హర్ష

కర్నూలు సిటీ: కోడుమూరు నియోజకవర్గంలోని ప్రతి పల్లెలో మౌలిక సదుపాయాలతో పాటు అభివృద్ధి పనులు మరింత చేస్తామని.. ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కొత్తకోట ప్రకాష్ రెడ్డి, ఎం.మణిగాంధీ ప్రజలను కోరారు. బుధవారం కర్నూలు రూరల్ మండల పరిధిలోని దిన్నెదేవరపాడు పంచాయతీలోని అంబేద్కర్‌నగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఐదేళ్ల జగన్ పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి పనులను వివరించారు. మరింత అభివృద్ధి, సంక్షేమ పథకాలు కావాలంటే మరోసారి వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలపాలని కోరారు. కాగా వీరి పర్యటనకు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. ముఖ్యమంత్రి జగనన్న పాలనలో తమ బతుకులు మారాయని.. సంక్షేమ పథకాలతో ఆర్థికాభివృద్ధి సాధించామని సంతోషం వ్యక్తం చేశారు. ఆయన్ను మరోసారి సీఎంను చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

ఆదరణ చూసి ఓర్వలేకనే విమర్శలు

అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సతీష్, కోట్ల హర్ష మాజీ ఎమ్మెల్యేలు ప్రకాష్‌రెడ్డి, మణిగాంధీ మాట్లాడుతూ.. వివిధ సంక్షేమ పథకాలతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి వస్తున్న ఆదరణ చేసి ఓర్వలేని ప్రతిపక్షాలు అసత్య ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని మండిపడ్డారు. గత ఎన్నికల్లోనే వారికి ప్రజలు బుద్ధి చెప్పారని.. ఈ ఎన్నికల్లో ఆ పార్టీలు కనుమరుగవుతాయన్నారు. ఓటు వేసే ముందు ఓసారి ఆలోచించి మంచి చేసే ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. ఎంపీగా బీవై రామయ్య, ఎమ్మెల్యేగా సతీష్‌ను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ప్రసన్నకుమార్, వైస్ ఎంపీపీ నెహిమియా, దిన్నెదేవరపాడు ఎంపీటీసీ సభ్యులు రామనాథ్ రెడ్డి, మద్దిలేటి, మాజీ సర్పంచ్ పెరుగు పురుషోత్తం రెడ్డి, నాయకులు శ్రీనివాసరెడ్డి, ప్రసాదు, ఎదురూరు వెంకటేశ్వర్లు, శేషిరెడ్డి అమర్నాథ్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, రేమట సంపత్, విష్ణువర్ధన్ రెడ్డి, అఖిల్ రెడ్డి, ఇసాక్, దామోదర్ నాయుడు, మౌలాలి, రాజశేఖర్, నందనపల్లె శేఖర్, మహానందిరెడ్డి పసుపుల శేఖర్, భాస్కర్, వినోద్ పాల్గొన్నారు.

ఏడాదిలోగా నీటి సమస్యను పరిష్కరిస్తాం

కోడుమూరు రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోగా కోడుమూరులో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి ప్రజలకు హామీ ఇచ్చారు. బుధవారం కోడుమూరులో చేనేత సంఘం నాయకులు లింగమూర్తి, చైతన్య, సీబీ దానకర్ణ ఏర్పాటు చేసిన చేనేత కుర్నీ బాంధవ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో చేనేత కార్మికుల కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని తెలిపారు. నేతన్న నేస్తం పథకం ద్వారా చేనేత కార్మికుల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతగానో కృషి చేశారని చెప్పారు. కోడుమూరులో నెలకొన్న మంచినీటి సమస్య పరిష్కారానికి రూ.27కోట్లతో చేపట్టనున్న జీడీపీ నుంచి పైపులైన్ నిర్మాణం ప్రస్తుతం టెండర్ దశలో ఉందని, వైఎస్సార్‌సీపీ గెలుపొందిన వెంటనే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సహకారంతో ఏడాదిలోగా పనులను పూర్తి చేయిస్తామని తెలిపారు. కోడుమూరు, చనుగొండ్ల, ప్యాలకుర్తి, వెంకటగిరి, వర్కూరు గ్రామాలకు నీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని చేనేత కార్మికులను కోరారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక

కోడుమూరులో టీడీపీకి చెందిన చేనేత కార్మిక సంఘం నాయకులు, సభ్యులు వెంకటేష్, మాదన్న, నాగేంద్రప్ప, షేక్షావలి, శేఖర్, మల్లేష్, రాము, ఎం.శేఖర్, నరసప్ప, శివ, గోపాల్, బాబు, ఎల్లప్ప, కుమార్,, గోపాల్, శంకర్, నాగరాజు, నరసింహులు, రాజు, నాగేష్, శంకర్, దస్తగిరి, రాజేష్, భారతి, కృష్ణ, నాగవేణి, వీరేష్, పార్థసారథి, విశ్వనాథ్ తదితరులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్, జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు క్రిష్ణారెడ్డి, ఉపసర్పంచ్ మాదులు, మాజీ ఉపసర్పంచ్ ప్రవీణ్‌కుమార్, ఎంపీటీసీ సీబీ మణి, పార్టీ మండల కన్వీనర్ రమేష్‌నాయుడు, నాయకులు మల్లారెడ్డి, రవిబాబు, రవికుమార్‌రెడ్డి, డిష్ రవి, మధు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి తొలిశాపురం వాసులు

కర్నూలు సిటీ: కర్నూలు రూరల్ మండల పరిధిలోని తొలిశాపురం గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ.. జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి పనులే ఎన్నికల్లో గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలకు ఎవరు ఏం చేశారో.. ఎవరి ఎలా మోసం చేశారో తెలుసునని అన్నారు. అందుకే పార్టీలోకి చేరికలు భారీగా పెరుగుతున్నారని తెలిపారు. పార్టీలో చేరిన వారిలో రేపల్లె రంగన్న, మద్దిలేటి, లక్ష్మన్న, సుంకన్న, మద్దిలేటి, దానం, సాయికృష్ణ, రాజు, ఎర్రమద్దిలేటి, డేనియల్, ప్రసాద్ సహా 30 మంది ఉన్నారు.





ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్, కోట్ల హర్ష సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న చేనేత కార్మికులు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్

నేడు గూడూరులో ఎన్నికల ప్రచారం

గూడూరు: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి గూడూరులో గురువారం ఎన్నికల ప్రచారం చేయనున్నట్లు ఆ పార్టీ మండల నాయకులు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.

నేడు వాహనాల వేలం

కోడుమూరు రూరల్: కోడుమూరు సెబ్ పరిధిలో మద్యం తరలిస్తూ పట్టుబడిన ద్విచక్రవాహనాలను గురువారం వేలం వేయనున్నట్లు సెబ్ సీఐ రామాంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు ప్రభుత్వ నిబంధనల ప్రకారం వేలం కంటే ముందు నిర్ణయించిన ధరావత్తు చెల్లించాల్సి ఉంటుందన్నారు. హెచ్చు పాట పాడిన వారు జీఎస్టీ కూడా కలిపి చెల్లించాల్సి ఉంటుందని సీఐ పేర్కొన్నారు.

పేదల సంక్షేమమే జగనన్న అజెండా



ఎన్నికల ప్రచారం చేస్తున్న శివనరసింహారెడ్డి

కల్లూరు: రాష్ట్రంలో పేదల సంక్షేమమే జగనన్న అజెండా అని వైఎస్సార్‌సీపీ నేత కాటసాని శివనరసింహారెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం కల్లూరు అర్బన్ 19వ వార్డులో వారు ఇంటింటికీ తిరుగుతూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందించిన సుపరిపాలనకు ప్రజలు మద్దతు ఇస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ప్రజలకు మంచి చేస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అంకార్యక్రమంలో నాయకులు గోపాల్‌రెడ్డి, శివరాంస్వామి, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ హయాంలో కరువు కాటకాలే

- నీటి కోసం స్టేషన్ మెట్లు ఎక్కిన ఘటనలు రైతులు మరిచిపోలేరు
- ప్రతిపక్ష నాయకులపై ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మండిపాటు
- ఎన్నికలు వస్తేనే వారికి ప్రజలు గుర్తుకొస్తారని ఎద్దేవా



కొలురు గ్రామంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పాణ్యం: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పాలన మొత్తం కరువు కాటకాలేనని.. ఎస్సార్బీసీ ఆయకట్టు రైతులు 2014–19 మధ్య కాలంలో జరిగిన సంఘటనలను మరిచిపోరని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని తొగర్చేడు, కొలురు, గోనవరం, ఆలమూరు గ్రామాల్లో ఆయన పర్యటించారు. చంద్రబాబు అధికారంలో ఉంటేనే వర్షాలు కూడా కరువవని ఎద్దేవా చేశారు. కరువు ఆయన కవల పిల్లలని పేర్కొన్నారు. ఆయన పాలనలో రైతులు ఎన్నో కష్టాలు అనుభవించారని గుర్తు చేశారు. సాగునీటి కోసం పోలీస్‌స్టేషన్ల మెట్లు ఎక్కాల్సిన పరిస్థితి కల్పించారని తెలిపారు. రైతులు నిద్రలేని రాత్రుళ్లు గడిపారన్నారు. రెండుసార్లు గోరుకల్లు వచ్చిన చంద్రబాబు ఎలాంటి పనులు చేయలేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రకృతి కూడా సహకరించిందన్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు సంతోషంగా ఉన్నారన్నారు. గోరుకల్లు నీటితో రైతులు రెండు పంటలు వేసుకున్నారని తెలిపారు. అలాగే రూ.1.5 కోట్లతో గోరుకల్లు కట్టకు మరమ్మతులు చేయించి ఈ ఏడాది వర్షాభావ పరిస్థితి నెలకొన్నా మార్చి వరకు రైతులకు నీరందించామని తెలిపారు. తొగర్చేడు గ్రామంలో సచివాలయ నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. కుందూ పరిపరక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు. కొలురులో దళితుల శ్మశాన వాటిక, సచివాలయం నిర్మించామని చెప్పారు. ఎన్నికల కోడ్ పూర్తయిన వెంటనే మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఎంపీపీ ఉసేన్‌బీ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీలు వెంకటేశ్వర్లు, పార్వతమ్మ, సర్పంచ్‌లు శ్రీనివాసరెడ్డి, మహ్మద్ షరీఫ్, నాయకులు చంద్రమౌళీశ్వరరెడ్డి, కృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, బాలస్వామిరెడ్డి, సారంగపాణి, సుధాకర్‌రెడ్డి, మహానందిరెడ్డి, ఉమేష్‌రెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీవి దిగజారుడు రాజకీయాలు

పాణ్యం: నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు దిగజారి రాజకీయాలు చేస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి విమర్శించారు. టీడీపీ నాయకులనే మళ్లీ పార్టీలోకి తీసుకుని ప్రచారం చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ప్రజలకు అన్నీ తెలుసని.. ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని తెలిపారు. కరపత్రాలు ఇచ్చి కండువాలు కప్పుతున్నారని.. దాన్ని ఎల్లో పత్రికల్లో ప్రచురించుకుని వికృత ఆనందం పొందుతున్నారన్నారు. నెరవాడ గ్రామంలో వైఎస్సార్‌సీపీకి చెందిన బి.జ్యోతిస్వరూప్‌రెడ్డి ఇంటికి వెళ్లిన టీడీపీ నాయకులు ఆయనకు కండువా వేసి సిగ్గు లేకుండా ప్రచారం చేసుకున్నారని మండిపడ్డారు. వారి ప్రచార యావ చూసి ప్రజలే నవ్వుకుంటున్నారన్నారు.

గోనవరం గ్రామానికి చెందిన జి. వెంకటరాముడు, రమేష్ కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి.



జ్యోతిస్వరూప్‌రెడ్డికి పార్టీ కండువా వేస్తున్న ఎమ్మెల్యే కాటసాని

వైఎస్సార్‌సీపీ పాలనలో అన్ని వర్గాల్లో ఆనందం



తిప్పాయపల్లెలో ప్రచారం చేస్తున్న ఉమామహేశ్వరమ్మ

ఓర్వకల్లు: వైఎస్సార్‌సీపీ పాలనలో అన్ని వర్గాలు సంతోషంగా ఉన్నాయని.. ఇలానే కొనసాగాలంటే మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కాటసాని ఉమామహేశ్వరమ్మ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం మండలంలోని తిప్పాయపల్లె, బ్రాహ్మణపల్లె, శకునాల గ్రామాల్లో ప్రచారం చేశారు. సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా.. అభివృద్ధి జరగాలన్నా ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు పోచా బ్రహ్మానందరెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కర్నూలు నగర డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు, జేసీఎస్ మండల కన్వీనర్ లోటర్‌బాష, సింగిల్ విండో చైర్మన్ నాగతిరుపాలు, సర్పంచ్‌లు కృష్ణవేణమ్మ, జయభారతమ్మ, జంగం రాధిక, ఎంపీటీసీ సభ్యులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, నాయకులు బీరం రాంపుల్లారెడ్డి, శివారెడ్డి, హరినాథ్‌రెడ్డి, రవిచంద్రుడు, మాలిక్‌బాషా, రామలింగేశ్వరరెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బి.తాండ్రపాడులో పార్టీ కార్యాలయం ప్రారంభం



బి.తాండ్రపాడులో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్, కుడా చైర్మెన్ కోట్ల హర్ష

కర్నూలు సిటీ: మండల పరిధిలోని బి.తాండ్రపాడు గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కోడుమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డా.ఆదిమూలపు సతీష్, కుడా చైర్మెన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొత్త కోట ప్రకాష్ రెడ్డి హాజరై పార్టీ కార్యాలయాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఆ గ్రామంలో ఇంటింటి ప్రచారం ప్రారంభించారు. ఐదేళ్ల ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి చెబుతూ ఎన్నికల్లో ఓట్లు వేయాలని వారు కోరారు. జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, వైస్ ఎంపీపీ నెహెమియా, మండల కన్వీనర్ మహబూబ్‌బాషా, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు డి.వాసు, బి.తాండ్రపాడు చిన్న లక్ష్మన్న, మోహన్ బాబు, సింగిల్ విండో చైర్మన్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

అంబరం.. అంజన్న సంబరం

హొళగుంద: మండలంలో బుధవారం హనుమాన్ జయంతి సంబరాలు అంబరాన్నంటాయి. మండల కేంద్రంలో యువకులు, పెద్దలు, హనుమాన్ మిత్ర మండళి సభ్యులు భారీ ఎత్తున తరలి వచ్చి ఊరేగింపులో పాల్గొన్నారు. పురవీధుల్లో స్వామి చిత్రపటాన్ని ఊరేగింపు నిర్వహించారు. మండల కేంద్రానికి 5 కి.మీ దూరంలో వెలిసిన అగ్రహార ఆంజనేయస్వామిని దర్శించుకోవడానికి భక్తులు తరలి వచ్చారు. ఆలయ ప్రదక్షిణ, అభిషేకాలు, పవమాన హోమం, మహామంగళ హారతి, అలంకారం, ఆకుల అర్చన, రుద్రాభిషేకం తదితర ప్రత్యేక పూజలు చేపట్టారు. అలాగే భజన కార్యక్రమాలు నిర్వహించారు. హొళగుంద, లింగంపల్లి, గజ్జహళ్లి, వందవాగిలి తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతిలో భాగంగా ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించి అన్నదానం చేశారు. ఇదిలా ఉండగా మండల కేంద్రం హొళగుందలో రెండేళ్ల క్రితం చోటుచేసుకున్న ఘర్షణను దృష్టిలో ఉంచుకుని పోలీసులు ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు.

నేటి నుంచి సత్యసాయి ఉచిత వేసవి శిక్షణ శిబిరం

కర్నూలు కల్చరల్: శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం నుంచి మే 5వ తేదీ వర కు ఉచిత వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు సేవా సమితి జిల్లాఅధ్యక్షుడు మాకా అశోక్‌కుమార్ తెలిపారు. నెహ్రూనగర్‌లోని సత్యసాయి మందిరంలో ప్రతిరోజు ఉదయం 9 నుంచి 11.30 గంటలకు శిబిరం జరుగుతుందని పేర్కొన్నారు. రోజువారి జీవితంలో ఉపయోగపడు శ్లోకాలు, పిల్లల్లో మానవతా విలువలు పెంపొందించడానికి అవసరమైన కథలు, భారతీ సంస్కృతికి సంబంధించిన ప్రాథమిక వివరణ, పిల్ల ల్లో దాగి ఉన్న నైపుణ్యాలను పెంపొందించే కార్యక్రమాలు,శారీరక వికాసానికి అవసరమైన ఆటలు ,ధ్యానం, యోగ అంశాల్లో శిక్షణ ఇస్తామన్నారు.

జగనన్నను గెలిపించుకుంటేనే మంచి భవిష్యత్తు



కోడుమూరులో ఇంటింటి ప్రచారం చేస్తున్న స్టెల్లా సతీష్

కోడుమూరు రూరల్: పేదల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న జగనన్నను ఈ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించుకుంటే పేద ప్రజల భవిష్యత్తు బాగుంటుందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్ భార్య స్టెల్లా సతీష్ ప్రజలను కోరారు. బుధవారం కోడుమూరులోని బేపారం వీధి, తేరుబజార్‌లో జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్ రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జగనన్న అమలు చేస్తున్న అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి వంటి పథకాల ద్వారా పేద విద్యార్థులంతా ఉన్నత చదువులు చదువుకుంటున్నారని తెలిపారు. సంక్షేమ పథకాలు అమలు కావాలంటే జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మాదులు, నాయకులు ప్రవీణ్‌కుమార్, రమేష్‌నాయుడు, షాజిత్ ఆలీ, మల్లారెడ్డి, మగ్బుల్‌బాషా, కల్యాణ్, వీర, లింగమయ్య, షాషావలి, లింగన్న, రాఘవేంద్ర, విష్ణుదాసు, గద్వాల రఫీక్, పరమేష్, సుబ్బారావు, ప్రసాద్, మాసుమ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కోన వెంకన్న రథోత్సవం



రథోత్సవానికి భారీగా తరలివచ్చిన భక్తులు



అశ్వవాహనంపై శ్రీవారు

సి బెళగల్: బ్రహ్మోత్సవాల్లో భాగంగా క్రిష్ణదొడ్డి కోన వేంకటేశ్వరస్వామివారి రథోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. మండలంలోని సి.బెళగల్, బురాన్‌దొడ్డి, కంబదహాల్, ఇనగండ్ల, సంగాలతో పాటు గూడూరు, కోడుమూరు, గోనెగండ్ల, ఎమ్మిగనూర్ మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. బుధవారం రాత్రి గణపతి పూజ, పుణ్యాహవాచకం, సంప్రోక్షణ గావించి అర్ధరాత్రి 12 గంటలకు కుంభం ప్రారంభించారు. కుంభం కాగు రథం దగ్గరకు చేరుకున్న అనంతరం పెద్ద ఎత్తున బాణ సంచా కాలుస్తూ బుధవారం తెల్లవారుజామున 5 గంటలకు మహారథోత్సవం నిర్వహించారు. శ్రీవారి రథోత్సవం వీక్షించేందుకు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కాగా బుధవారం సాయంత్రం అశ్వవాహన సేవ, గజవాహన సేవ అనంతరం పార్వేట కార్యక్రమం జరిగింది. భక్తులకు అన్నదానం చేశారు. గురువారం వసంతోత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలో విద్యుత్ లోడ్ డైవర్షిఫికేషన్ పనులు జరుగుతుండటంతో వివిధ ఏరియాలకు గురువారం ఉదయం 6 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా బంద్ చేస్తున్నట్లు ఏడీఈ నాగప్రసాద్ తెలిపారు. పవర్‌హౌస్‌లో ఉన్న మౌర్య ఇన్ ఫీడర్‌లో అధిక లోడ్ ఉండటం వల్ల జెడ్పీలో ఉన్న ఉడ్‌ల్యాండ్స్ ఫీడర్‌కు లోడ్‌ను డైవర్షిఫికేషన్ చేస్తున్నట్లు తెలిపారు. జలమండలి, మౌర్యాఇన్ రోడ్డు, మెన్స్ మెడికల్ హాస్టల్, బంగారుపేట, రాజ్ విహార్ సెంటరు, ఉడ్‌ల్యాండ్స్ లాడ్జీ ఏరియా, గౌరిగోపాల్ హాస్పిటల్ ఏరియా, సుశీల నేత్రాలయ, ఓమినీ హాస్పిటల్స్ రోడ్డు, హబీబ్ ముబారక్ నగర్ ఏరియాలకు విద్యుత్ సరఫరా కొద్ది గంటల పాటు నిలుపుదల చేస్తున్నామని పేర్కొన్నారు.

టెండర్లు మరోసారి వాయిదా

మహానంది: మహానంది దేవస్థానం కార్యాలయంలో బుధవారం వివిధ విభాగాలకు నిర్వహించిన టెండర్లు, బహిరంగ వేలాల్లో ఒకటి మినహా మిగిలినవి మరోసారి వాయిదా వేస్తున్నట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. దీపారాధన సామగ్రికి ధనుంజయ రూ. 32లక్షలు, రాజలింగేశ్వరయ్య రూ. 31లక్షలు, మహేశ్వరయ్య రూ. 30లక్షలకు ముగ్గురు సీల్డు టెండర్లు దాఖలు చేశారు. ఇదే ముగ్గురు కొబ్బరిచిప్పల సామగ్రికి వరుసగా రూ. 12.6లక్షలు, రూ. 11లక్షలు, రూ. 10.50లక్షలకు దాఖలు చేసినట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.